క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చేబ్రోలు: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని చేబ్రోలు ఎంపీడీవో కె. లలిత అన్నారు. చేబ్రోలులో బుధవారం స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీడీవో కె. లలిత, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి. శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, సూపరింటెండెంటు జి. ఉమ, పారిశుద్ధ్య కార్మికులు, మండల పరిషత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

ప్రత్తిపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక శ్రీ గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఆలయ అర్చకులు పరమేశ్వరశర్మ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నవరాత్రి వేడుకలు జరగనున్నాయి. తొలిరోజు 3వ తేదీన రజత కవచాలంకృత పార్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 4న బాలా త్రిపురసుందరి, 5న అన్నపూర్ణ, 6న రాజరాజేశ్వరీదేవి, 7న చండికా దేవి, 8న గజలక్ష్మి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని, 12న పుష్పశయ్య అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు అర్చకులు పరమేశ్వరశర్మ తెలిపారు.

రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో..

దసరా ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చినకోండ్రుపాడు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు 3న బాలాత్రిపురసుందరీదేవి, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని, 12న రాజరాజేశ్వరిదేవి అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది.

వేణుగోపాలస్వామి దేవాలయంలో..

ప్రత్తిపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో 3న మహాలక్ష్మి, 4న గజలక్ష్మి, 5న అన్నపూర్ణ, 6న మంగళగౌరి, 7న లలితాదేవి, 8న చండీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని, 12న పుష్పశయ్య అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ప్రమాణాలు పాటించకపోతే వాటర్ ప్లాంట్లు సీజ్

ప్రత్తిపాడు: ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలను పాటించకపోతే ప్లాంట్‌లను సీజ్ చేసేందుకు గ్రామ పంచాయతీ వెనుకాడబోదని పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా స్పష్టం చేశారు. ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీజయంతిని పురస్కరించుకుని బుధవారం గ్రామ సభను నిర్వహించారు. కలుషిత నీటిని విక్రయిస్తున్నారంటూ 'జలమా గరళమా..!' శీర్షికన సాక్షిలో గత నెల 30వ తేదీన కథనం ప్రచురించిన నేపథ్యంలో అధికారులు గ్రామసభలో స్పందించారు. ఈ సందర్భంగా జాన్‌పీరా మాట్లాడుతూ అనుమతులు లేని వాటర్ ప్లాంట్లును ఏర్పాటు చేసి కలుషితమైన నీటిని ప్రజలకు విక్రయిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హెల్త్ సిబ్బందిని పంపి పరీక్షలు చేయించినట్లు తెలిపారు. గురువారం మరోసారి సిబ్బందిని పంపి నిర్వహిస్తామని చెప్పారు. గతంలో కూడా ఒకటికి రెండు సార్లు హెచ్చరించి, పద్ధతి మార్చుకోవాలని నోటీసులు కూడా జారీ చేశామన్నారు. అయినా వారి పద్ధతిలో మార్పు రాలేదని తెలిపారు. డబ్బే ప్రధానంగా ప్లాంట్ల నిర్వాహకులు పని చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రత్తిపాడులో గురువారం వైద్య ఆరోగ్యశాఖ బృందం పర్యటించనుందని, వారు కూడా నీటిని పరీక్షిస్తారన్నారు. ఎక్కడైనా నీరు కలుషితమైనట్లు నిర్ధారణ అయితే అక్కడికక్కడే ప్లాంట్లు సీజ్ చేస్తారని చెప్పారు.

40 ఏళ్లలో వందసార్లు రక్తదానం



గుంటూరు ఎడ్యుకేషన్: 40 ఏళ్లలో వంద సార్లు రక్తదానం చేసిన గుంటూరు నగరానికి చెందిన మిర్చి వ్యాపారి పోలిరెడ్డి ఉమామహేశ్వరరావును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు అభినందించారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రామచంద్రరాజు మాట్లాడుతూ.. అనేక మంది ప్రాణాలు కాపాడటంతోపాటు కొవిడ్ సమయంలో రెడ్ క్రాస్ వలంటీర్‌గా ఉమామహేశ్వరరావు సేవలు అందించారని తెలిపారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మన ధర్మం అని తెలిపారు.

గాంధీ ఆశయ సాధనే ధ్యేయం

- మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు
- పొన్నూరులో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

పొన్నూరు: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ కమీషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. పొన్నూరులో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురపాలక సంఘం కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి కమిషనర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శనీయుని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల్ని స్మరించుకోవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక, ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వరద ప్రభావంతో ముంపు ప్రాంతాల్లో సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్వో వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం సభ్యులు కమిషనర్‌ను సత్కరించారు.
- మామిళ్లపల్లిలో సర్పంచ్ జాలాది యానాదిరావు ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల్ని సన్మానించారు.

పెదకాకానిలో..

మహనీయుల అడుగుజాడల్లో యువత నడుచుకుని సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా గుర్తింపు తెచ్చుకోవాలని గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ తెలిపారు. పెదకాకాని లూథర్‌గిరి గ్రంథాలయంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ 155వ జ యంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ యు ద్ధాలు, దండయాత్రలతో కొట్టుకుపోతున్న ప్రపంచాని కి సత్యాగ్రహం, అహింస అనే పదునైన ఆయుధాలను పరిచయం చేసిన మహనీయుడు గాంధీ అన్నారు. కార్యక్రమంలో పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధిద్దాం

ప్రత్తిపాడు: చేయిచేయి కలిపి బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాధించుకుందామని ప్రత్తిపాడు ఎంపీడీవో కె. శివపార్వతి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని కోయవారిపాలెం, తిమ్మాపురం, గనికపూడి గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్లను పునఃప్రారంభించారు. పెదగొట్టిపాడులో శ్రమదానం నిర్వహించి, క్లాప్ మిత్రలను సత్కరించారు. తొలుత ఆయా గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లలో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివపార్వతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. చెత్త నుంచి సంపద సృష్టించుకునే విధంగా గ్రామ పంచాయతీలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు మరియరాణి, వీరమల్లేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కె. మధు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ రమేష్‌బాబు



మామిళ్లపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ యానాదిరావు

మహనీయుల త్యాగం మరువలేనిది

ప్రత్తిపాడు: మహనీయుల త్యాగాన్ని భావితరాలు మరవకూడదని బీజేపీ నాయకుడు, అర్చక జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి అన్నారు. అక్టోబరు 2న గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు కఠారి దత్త ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన జంధ్యాల స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద రోడ్లు శుభ్రం చేశారు. జాతీయ నాయకుల విగ్రహాలని కడిగి శ్రమదానం చేశారు. అనంతరం వేణుగోపాల స్వామి గుడి, పంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంధ్యాల మాట్లాడుతూ శాంతి మార్గంలో, అహింసాయుతంగా ఉద్యమాలను నడిపి దేశ స్వాతంత్ర్యానికి మహాత్ముడు దారి చూపాడన్నారు. జై జవాన్.. జై కిసాన్ నినాదంతో భారతదేశ సమగ్రతకు సోపానం వేసిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ దర్శనపు శ్రీనివాసరావు, నాయకులు పి. వెంకట శివయ్య, నార్ల శ్రీనివాసరావు, జి.అప్పారావు, బి.వి.రమణారెడ్డి, మట్టా వెంకటేశ్వర్లు, మొవ్వా సాంబశివరావు, మొవ్వ రామచంద్రరావు, ఈద శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో నివాళులు

గుంటూరు రూరల్: అహింస, గ్రామ స్వరాజ్యం ఆయుధాలుగా భారతావనికి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కృషి చేసిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. గోరంట్లలోని కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కె. సుస్మిత పాల్గొన్నారు.

భారత దేశ ముద్దుబిడ్డ గాంధీ

కాకుమాను: భారతదేశ ముద్దుబిడ్డ మహాత్మా గాంధీ అని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని తహసీల్దార్ బి.వెంకట స్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే ప్రతి ఒక్కరూ ఆయన బోధనలు, బాటలోనే నడవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘన నివాళులు

గుంటూరు రూరల్: శాంతియుతంగా యుద్ధం చేసి స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు మన జాతిపిత గాంధీ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి. రామచంద్రరావు తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం, సహాయ నిరాకరణ, అహింసా సిద్ధాంతాలతో ముందుకు సాగిన ప్రతి ఒక్కరికీ మార్గదర్శకుడు మన గాంధీజీ అని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పీజీ స్టడీస్ డీన్ ఎ.వి. రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ బి. శ్రీలక్ష్మి, రీసెర్చ్ డైరెక్టర్ పి.వి. సత్యనారాయణ, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ జి. శివన్నారాయణ, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ జి. కరుణాసాగర్, కంట్రోలర్ బి.వి.ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.



సెయింట్ ఆన్స్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

బజరంగ్ కార్యాలయంలో ఘన నివాళి



మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు: మహాత్మగాంధీ బోధించిన సత్యాగ్రహం, అహింస, శాంతి వంటి మార్గాలు మానవాళిని ప్రభావితం చేశాయని బజరంగ్ అర్బన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. గుంటూరులోని బజరంగ్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గాంధీ తత్వం మానవాళి మనుగడకు అనుసరణీయమని తెలిపారు. శాంతి, అహింసలే ప్రపంచ మానవ సమాజాన్ని కాపాడతాయని పేర్కొన్నారు. దేశ ప్రధానిగా లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మార్గంలో విద్యార్థులు పయనించాలి

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

చేబ్రోలు: మహాత్మాగాంధీ చూపిన మార్గంలో విద్యార్థులందరూ పయనించాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ పూజ్య బాపూజీ కలలు కన్న ఆశయాలను నెరవేర్చవలసిన బాధ్యత మన అందరిపైన ఉందని తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల్ని అందించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్తయ్య

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులు

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కార్యాలయంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులు అర్పించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు నాయకులు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ జరిపిన శాంతియుత పోరాటం ముందు తరాలకు ఆదర్శనీయమని తెలిపారు. అహింస, గ్రామ స్వరాజ్యం వంటి ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ రమేష్‌బాబు



ప్రత్తిపాడులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి



గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు



కాకుమానులో నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి, సిబ్బంది

సీబీసీ ఆధ్వర్యంలో ముగిసిన స్వచ్ఛతా హీ సేవ

గుంటూరు రూరల్: కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)గుంటూరు కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు గాంధీ జయంతితో ఘనంగా ముగిశాయి. పెదపలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గుంటూరు ప్రచార అధికారి ఆర్. రమేశ్చంద్ర మాట్లాడారు . గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాలలో సీబీసీ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ, శ్రమదానం, యువ భాగస్వామ్య కార్యక్రమాలలో దాదాపు రెండు వేలమంది పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాల, గృహ పరిసర ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారని చెప్పారు. అనంతరం కళాశాలకు చెందిన 10(ఆంధ్రా) బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్‌లు, సీబీసీ సిబ్బంది గుంటూరులో కొరిటిపాడు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీ విగ్రహ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవ ప్రాముఖ్యాన్ని, ప్లాస్టిక్ వాడకం వల్ల నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలకు చేరుకున్న విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ చెన్నుపాటి జ్యోతిప్రియ ఆధ్వర్యంలో గాంధీ చిత్రాన్ని, స్వచ్ఛ భారత్‌కు చిహ్నంగా వాడుతున్న గాంధీ కళ్లజోడు ఆకృతిని రూపొందించి స్వచ్ఛ భారత్ పదవ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



గాంధీ జయంతి, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్

దర్యాప్తు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

లక్ష్మీపురం: సిబ్బంది దర్యాప్తు నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా స్టేషన్ ఆవరణను, పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ మరమ్మతులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసి తక్షణమే అందజేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులకు దోహదపడే దర్యాప్తు విధానాలపై పలు సూచనలు, సలహాలను స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ జయరాం ప్రసాద్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: గాంధీ జయంతి రోజున నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట పరిసర ప్రాంతాల్లోని ఓ లాడ్జిలో స్వీపర్‌గా పనిచేసే బి.రమేష్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంకు వద్ద మద్యం విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి 12 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాట్రపాడులో తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

గ్రామసభ సాక్షిగా మరోసారి టీడీపీలో బయటపడ్డ వర్గ విభేదాలు

ప్రత్తిపాడు: అధికారంలోకి వచ్చినా టీడీపీలో వర్గ విభేదాలు మాత్రం చల్లారడం లేదు. ఆధిపత్య పోరులో భాగంగా ఎప్పటికప్పుడు అసమ్మతి నేతలు రగిలిపోతూనే ఉన్నారు. తాజాగా గ్రామసభ సాక్షిగా ఇరువర్గాల మధ్య వర్గపోరు రోడ్డుకెక్కింది. గాంధీ జయంతి సందర్భంగా వట్టిచెరుకూరు మండలం కాట్రపాడులో బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఇందులో రక్షిత మంచినీటి చెరువుకు పూడికతీత విషయంలో ఇరువర్గాలకు మధ్య వాగ్వాదం జరిగింది. వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. సహనం కోల్పోయిన ఇరువర్గాల తెలుగు తమ్ముళ్లు సభా ప్రాంగణంలోనే బాహాబాహీకి దిగారు. దీంతో గ్రామసభ రచ్చరచ్చ అయ్యింది. గ్రామాభివృద్ధికి నిర్వహించిన సభలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఉన్న విభేదాలు బయట పడటంతో రసాభాసగా మారింది. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో స్థానికులు ఇరువర్గాలను శాంతింపజేశారు. అయితే ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు

ప్రత్తిపాడు: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలను నిర్వహించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగిన సభల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులతో పాటు పని దినాలు, ఖర్చు చేసిన నిధుల వివరాలను ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ అధికారులు వివరించారు. అనంతరం ఉపాధి ద్వారా ఏరకమైన పనులు చేసుకోవచ్చు అనే అంశాలను గ్రామస్తులకు తెలియజేశారు. మరలా రెండవ గ్రామసభను నిర్వహించి ఉపాధి హామీ పథకం కింద రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. గ్రామస్తులు, రైతులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చేయాల్సిన పనుల్ని గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్లుకు తెలియజేయాలని ఇన్‌చార్జి ఏపీవో మస్తాన్‌వలి తెలిపారు. గ్రామసభ తీర్మానం ద్వారా ఆమోదం తీసుకుని, అంచనాలను సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. గ్రామసభల్లో సర్పంచులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

మండలంలో ఉపాధి హామీ పథకం గ్రామ సభలు బుధవారం మొక్కుబడిగా జరిగాయి. 2025 -2026 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టనున్న పనుల గురించి వెల్లడించారు. వీరనాయకునిపాలెంలో ఉదయం 11గంటలకు గ్రామసభ జరగాల్సి ఉండగా, ఆ సమయానికి ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కొద్దిసేపటికి పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది వచ్చారు. మొక్కుబడిగా గ్రామసభను పూర్తి చేశారు. గ్రామసభల్లో ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో ఆనంద్ మోహన్, టీఏలు ఎస్. సంపత్ పాల్గొన్నారు. శేకూరు, శలపాడు, వీఎన్ పాలెం గ్రామాల్లో నిర్వహించిన సభల్లో పీఎస్ ప్రశాంతి, గ్రామ సర్పంచ్ యర్రాకుల అనితకుమారి, స్థానిక టీడీపీ నేత బి. పున్నయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ పొన్నూరు సాధనే లక్ష్యం



పొన్నూరు: స్వచ్ఛ పొన్నూరు సాధనలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం కమిషనర్ అధికారులు, నాయకులతో కలిసి పట్టణంలోని పలు వార్డులు, పార్కుల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని అన్నారు. పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి నినాదం కావాలని పేర్కొన్నారు. పట్టణవాసులు తమ ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు.